వరద ప్రవాహం.. సమస్య పరిష్కారం



పూడికతీతను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారి మహంకాళినగర్, ఛత్రపతి శివాజీ నగర్ వద్ద మ్యాన్‌హోల్ నుంచి వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎయిర్‌టెక్ యంత్రం సహాయంతో డ్రైనేజీలోని పూడికను శుభ్రం చేయడంతో వరద నీటి ప్రవాహ వేగం తగ్గింది. కార్యక్రమంలో అంజయ్య యాదవ్, మోజెస్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్ తవ్వకం..కూలిన పక్కింటి ప్రహరీ



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ ఫేజ్–2లో సెల్లార్ నిర్మాణం కోసం గుంత తవ్వగా పక్క ఇంటికి సంబంధించిన ప్రహరీ కూలింది. దీంతో స్థానికంగా నిర్మాణం చేపడుతున్న ప్లాట్ యజమానికి, ప్రహరీగోడ కూలిపోయిన ఇంటి యజమానికి మధ్య వివాదం మొదలైంది. వివరాల్లోకి వెళితే..ధర్మారెడ్డికాలనీ ఫేజ్–2లోని ఎంఐజీ– 96కు సంబంధించి సెల్లార్ తవ్వకం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎలాంటి సపోర్ట్ లేకుండా ఉన్న పక్కనే ఉన్న ఎంఐజీ–52 ఇంటి ప్రహరీ కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఫిర్యాదు చేయనున్నట్లు ధర్మారెడ్డికాలనీ ఫేజ్–2 సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టనున్నట్లు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, దేవి, డ్రైనేజీ సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, కాలనీవాసులు నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు, కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చనే ఆలోచనతో శుక్రవారం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. అదే విధంగా ఇంట్లోని చెత్తను సేకరించడానికి మోటార్ రిక్షా వెహికల్‌ను ప్రారంభించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కునందజేస్తున్న, బండి రమేష్, వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ దయార్‌గూడకు చెందిన సింగూరి నర్సింగరావుకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన ప్రొఫెసర్ కోదండ రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు డా. పి. నాగిరెడ్డి - మూసాపేట

యువత భవితకు వెలుగుల దివ్వె

పేద, మధ్య తరగతి వర్గాలకు చేయూతనిస్తున్న లైట్ హౌస్

- కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు
- మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కోర్సులు
- జీహెచ్‌ఎంసీ, దాతల అండతో నిర్వహణ

చందానగర్: నేడు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రాని పరిస్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర పూణెకు చెందిన గణేష్ నటరాజన్, రుచి మాథుర్‌లు కలిసి 'లైట్ హౌస్' కమ్యూనిటీస్‌ను ప్రారంభించారు. యువతకు అవసరమైన పరిజ్ఞానంతో బాటు మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీతో పాటు 22 కోర్సులలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలతో లైట్ హౌస్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి, ఇంగ్లిష్‌లో మాట్లాడడం.. వీటన్నింటిని ఉచితంగా నేర్పిస్తున్నారు చందానగర్ హుడా కాలనీలో 'లైట్ హౌస్' కమ్యూనిటీస్‌లో. ఈ శిక్షణ బయట తీసుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో పలువురికి దారి చూపుతున్నారు ఈ కేంద్రం నిర్వాహకులు. ఇప్పటి వరకు పూణె, ఒడిశా ,ముంబై, ఢిల్లీ, లక్నో, హైదరాబాద్‌లలో 32 లైట్ హౌస్ కేంద్రాలు ఉన్నాయి. శిక్షణ కోర్సులు ఉచితంగా నేర్పించి 80 శాతం యువతకు ఉద్యోగ అవకాశాలు కలిస్తున్నారు. ఇక్కడకు ఐటీ ఉద్యోగులు సైతం వచ్చి బోధిస్తున్నారు. కాగా నగరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో కూకట్‌పల్లి, బోరబండ, మల్లేపల్లి, ఎల్బీనగర్‌లలో మరో నాలుగు లైట్ హౌస్‌లు ఏర్పాటు చేయనున్నారు.



చందానగర్ హుడా కాలనీలోని లైట్ హౌస్



టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు

- రాష్ట్రంలో మొట్టమొదటి లైట్ హౌస్‌ను 2023 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీతో కలిసి చందానగర్ హుడా కాలనీలో ఉన్న మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేశారు.
- యువతీ, యువకులకు సుమారు 22 రోజులు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి యువత వచ్చి వారికి కావలసిన కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.
- యువకులకు కంప్యూటర్‌తో పాటు వారికి కావలసిన ట్యాలీ, జావా వంటి కోర్సులు, ఇంటర్వ్యూలకు స్పోకెన్ ఇంగ్లిష్ కూడా నేర్పిస్తున్నారు.
- బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు.
- ఆయా కోర్సులకు సంబంధించి తరగతి గది, గ్రూప్ డిస్కషన్ కోసం, కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ గదులు నిర్మించారు.
- లైట్ హౌస్‌లో 12 మంది ట్రైనర్లు శిక్షణ ఇవ్వడానికి అందుబాటులో ఉన్నారు.
- ఫౌండేషన్ కోర్సు 22 రోజులు. 3 నెలల పాటు స్కిల్స్ నేర్పిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.
- 2023 సంవత్సరం నుంచి నేటి వరకు 40 బ్యాచ్‌లతో 920 మంది యువత నైపుణ్యం కోసం నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 418 మంది ఉద్యోగ అవకాశాలు అందించాం. 291 మందికి వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- లైట్ హౌస్‌లో కోర్సులలో చేరాలంటే 18–35 సంవత్సరాల వయో పరిమితి ఉంది. ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలి.



కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న యువత

ఉచిత శిక్షణ



చందానగర్‌లోని లైట్ హౌస్‌లో పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ తదితర కోర్సులు ఉచితంగా నేర్పిస్తున్నాం. ప్రభుత్వ సహాయంతో లైట్ హౌస్ కేంద్రాలను విస్తరిస్తున్నాం. 40 బ్యాచ్‌లతో 920 మంది యువత శిక్షణ కోసం నమోదు చేసుకున్నారు. –శ్రీనివాస్ ఆకుల, లైట్ హౌస్ ప్రోగ్రాం మేనేజర్

నేడు రాందేవ్‌రావ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: పశ్చిమ బెంగాల్ కోల్‌కత్తాలో పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపు మేరకు శనివారం రాందేవ్‌రావ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, హాస్పిటల్ సీఈఓ యోబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లోని గాంధీ విగ్రహం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

నోబెల్ పీస్ సమ్మిట్‌కు ఆహ్వానం

రాయదుర్గం: మెక్సికోలోని మాంటెర్రేలో జరగనున్న 19వ వరల్డ్ సమ్మిట్ ఆఫ్ నోబెల్ శాంతి గ్రహీతల సమావేశానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ కన్సల్ట్, డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలకు ఆహ్వానం అందింది. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.'స్పిరిచ్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ రక్షాబంధన్ పేరిట 'టైయింగ్ ఆఫ్ రాఖీ అండ్ మెడిటేషన్' అంశంపై పూణేకు చెందిన ప్రముఖ పిడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మనోజ్ మత్నాని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

జేఎన్‌టీయూలో తీజ్ నిమజ్జన మహోత్సవం



నిమజ్జన మహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో శుక్రవారం తీజ్ నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీఎస్ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భోగ్ బండార్ కార్యక్రమంతో ఈ ఉత్సవం ప్రారంభమైంది. బంజారా విద్యార్థినులు తీజ్ బుట్టలను భక్తి శ్రద్ధలతో అమ్మవారికి, సేవాలాల్ మహారాజ్‌కి సమర్పించారు. తీజ్ మొక్కల్ని పూజించి యూనివర్సిటీ అధికారుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు వినోద్ నాయక్, పూర్వ అధ్యక్షులు నరేందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాశ్ నాయక్, సింహాద్రి, భూక్య, విష్ణు నాయక్, లకావత్ లైలా, బానోత్ అనూష, గౌతమి, అరుణ, శిరీష, హర్షిని, బాలకృష్ణ, కోటియా నాయక్, రీసెర్చ్ స్కాలర్స్ అవినాష్ పాల్గొన్నారు.

కుక్క కాటు బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో...

తక్షణమే వైద్యం అందించాలి



సీహెచ్‌ఎన్‌సీలో కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ పోట్రు

- బాధితుల వివరాలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్
- మేడ్చల్ సీహెచ్‌ఎన్‌సీని పరిశీలించిన కలెక్టర్

మేడ్చల్: కుక్కకాటుకు గురైన వారికి తక్షణమే వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశించారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కుక్క కరిచిందని ఎవరైనా ఆస్పత్రికి వస్తే వారికి సత్వరమే వైద్యులు చికిత్సలు చేసి అవసరమైన మందులు ఇవ్వాలని అన్నారు. కుక్కకరిచిన వారు ఏ ప్రాతం నుంచి వచ్చారో తెలుసుకుని వారి వార్డు, గ్రామాల వివరాలు మున్సిపల్ కమిషనర్, గ్రామ అధికారులకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్టెరిలైజేషన్ చేసే వీలు ఉంటుందని అన్నారు.

- వీధి కుక్కలు, కోతుల నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అందరిపై ఉందని వాటి నుంచి రక్షించుకోవడానికి కాటుకు గురైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపించాలని సూచించారు.
- సీజనల్‌గా వ్యాపించే డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మురుగు, కలుషిత నీరు, ఆహారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- రాపిడ్ టెస్టు కిట్స్ ద్వారా బ్లడ్ శాంపిల్స్ తీసుకుని జ్వర తీవ్రతను బట్టి అత్యవసరమైన వైద్య సదుపాయం అందించాలని సూచించారు. మున్సిపల్, గ్రామీణ సిబ్బంది దోమల వ్యాప్తి లేకుండా ప్రతి రోజూ ఫాగింగ్ చేయించాలని అదేశించారు.
- ఆస్పత్రిలో కావాల్సిన మందులు, బెడ్‌లు, రాపిడ్ టెస్ట్ కిట్స్ అదనంగా అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో ఆయన సమీకృత సలహా పరీక్ష కేంద్రం, ఆయుష్ విభాగం, ఫార్మసీ, ల్యాబ్, ఇన్ ఔట్ పేషెంట్ విభాగాలను పరిశీలించి ల్యాబ్ అధునాతమైన టెస్టింగ్ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.
- జిల్లా వైద్యాధికారి రఘునాథ్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మండల అధికారులు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ



ఆల్విన్‌కాలనీ: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని మల్లికార్జున స్వామి దేవాలయంలో కొలువుదీరిన భ్రమరాంబ అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు అఖిలేశ్వర శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సామూహిక మంగళ గౌరీవ్రతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

చికిత్సలో నూతన విధానం అవసరం

- రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించాలి
- కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు వీరేందర్, మాలిక్

రాయదుర్గం: రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించడంతో బాటు చికిత్సలో నూతన విధానాలు అమలు చేయాలని కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మాలిక్‌సింగరాజు, డాక్టర్ వీరేందర్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్, హెచ్‌సీయూ సైన్స్ గురుస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ వినియోగం కూడా అవసరమని, కానీ దాని వల్ల ఏర్పడే లాభనష్టాలను బేరీజు వేసుకోవాలన్నారు. వైద్యాధికారులు సునీల్, డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణలో ఏఐ యొక్క క్లిష్టమైన అంచనాపై వారు వివరించారు. ఏఐ డేటా ప్రమాదాలను పరిష్కరించడానికి , డేటా సమగ్రతను నిర్ధారించడానికి మానవ పర్యవేక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో ఐఈఎఫ్ఆర్, రెజీన్ ప్రతినిధి డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఫెడరేషన్ ఆఫ్ ఆసియా బయోటెక్ అసోసియేషన్స్ సెక్రటరీ జనరల్ డాక్టర్ పి రత్నాకర్, నేషన్ బయో ఫార్మా మిషన్ ప్రతినిధి డాక్టర్ రాజ్‌షిర్ముల్లా, డాక్టర్ బీవీఎస్ సునీల్ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.